25-4-86 ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక

# జీవన విలాసం

మాధవ్

**ఆరోజు వారు ఇంటికి తిరిగి వచ్చేటప్పటికి ఎనిమిది గంటలైంది.**

రావడంతోనే, "శశీ, ఇవాళ మందు తాగుదామని వుంది" అన్నారు.

"అలమారలో డబ్బుచ్చుకుని నాన్నార్కి విస్కీ పట్టా బాబీ" అని పిల్లాడ్ని వెంటనే పంపా.

ఆశ్చర్యపోతున్నారా? మా వారు ఏదన్నా నోరు తెరిచి అడగటం ఇది రెండోసారో, మూడోసారో! చిన్న పిల్లాడ్ని చూసినట్టు ఆయన్ను చూసుకోవాలి. జీతం డబ్బులు తెచ్చి నాకిస్తే, నేనే సంసారం చూసుకుంటాను. ఆయన బట్టలు చిరిగినా పట్టించుకోరు. నేనే కనిపెట్టి కొత్తబట్టలు కుట్టిస్తాను.

మా పెళ్ళయి పదిహేనేండ్లు అవుతుంది. ఆర్థిక సమస్యలు ఏమీ లేవు. వారిది బంగారం లాంటి బ్యాంకు ఉద్యోగం; ఇంట్లో బాబీ తప్ప నాలుగోవారు ఎవరూ లేరు.

అయినా వారి ముఖంలో ఎప్పుడూ ఏదో అనిర్వచనీయమైన బాధ రేఖామాత్రంగా ద్యోతకమవుతుంది. ఆ బాధకు కారణం పని భారమూ కాదు, వంట్లో నలతా కాదు.

అలాంటి శ్రీవారి ముఖంలో ఆ రాత్రి నాకు ప్రశాంతత కొట్టవచ్చినట్టు కనపడింది. దరహాసంలో ఒకింత చిరునవ్వు తొణికిసలాడింది.

నాకెంతో సంతోషమేసింది. "ప్రమోషను వచ్చిందా? లాటరీ తగిలిందా? పర్సు దొరికిందా?" లాటి ప్రశ్నల వర్షమేమీ కురిపించలేదు. అలాంటివేమీ కాదని నా అంతరాత్మకు తెలుసు.

బాబీ ఇంకా రాలేదు. ఈలోపల మళ్ళీ శ్రీవారు అందుకున్నారు. "వచ్చే వారమే మనం కాశ్మీరు ప్రయాణం".

నేను వింటున్నది నిజమేనా అని చెవులు తడిమి చూసుకున్నా.

మనోనేత్రం ముందు గతమంతా సినిమా రీలులాగా పరిగెత్తడం మొదలుపెట్టింది.

పెళ్ళయిన మొదటి సంవత్సరంలోనే ఒకరోజున "ఏమండీ! కంచి పట్టుచీర కొనుక్కుందామని వుంది" అన్నా. ఆయన కాదనలే. కాని వారి మాటలతో పట్టుచీరలంటేనే విరక్తి పుట్టింది.

"దేశంలో సగం మంది రెండు పూటలా తిండి లేక పస్తుంటుంటే నువ్వు పట్టుచీరెల్లో కులుకుతానంటే నాకేం అభ్యంతరం లేదు" అన్నారు. ఓ గంట ఆయనంటేనే చిరాకు పుట్టింది.

కట్నం తీసుకోకుండా పెళ్ళి చేసుకున్న మాట నిజమే. అంత మాత్రం చేత జీవితంలో సరదాలే పడకుండా వుండాలా? ఏ బ్యాంకు ఉద్యోగిని చూసినా నాకు గుండె తరుక్కుపోతూ వుండేది. ఆయనకు స్కూటరు, ఆమెకు ఫ్రిజ్, మిక్సీ, సోఫా, గ్యాసు కనెక్షను. ఒకటేమిటి ఎప్పుడూ మిగిలిన వారంతా చిలకాగోరింకల్లా కన్పడేవారు.

"ఇది నా ఖర్మ" అనుకున్నా. తెలీకుండా పెద్దగానే అన్నా. అది వారు విన్నారు.

"శశీ, ఈ ఖర్మ సిద్ధాంతమే మనకు చేటు తెస్తుంది. సంఘంలో బీదవారు, ధనికులు వున్నారంటే అది వారి ఖర్మ ఫలితమనుకోబోకు. మనం వుంటున్నది ఒక దోపిడీ వ్యవస్థలో. మనిషిని మనిషి దోపిడి చేసే ఈ వ్యవస్థ అంతిమ ఘడియలు వచ్చేశాయి. దావానలం శ్రీకాకుళంలో ప్రారంభమయిందని వినపడం లేదా?"

ఆ మరుసటి రోజు, ఆ మరుసటిరోజు నా వరకు మామూలుగానే తెల్లవారింది. కాని ఆ అరుణోదయ సూర్యుణ్ణి చూస్తేనే వారికి వళ్ళు పులకరించేది.

రోజులు గడిచేకొద్దీ వారి ముఖంలో ఆందోళన కన్పడసాగింది. ఓ రోజున ఎంతో విచారంతో ఇంటికి వచ్చారు. తన స్నేహితుడి తండ్రిని నక్సలైట్లు నరికి వేశారుట.

కాలేజిలో చదువుతుండగా ఆ స్నేహితుని స్వగ్రామానికి మా వారు వెళ్ళివచ్చారుట. వాళ్ళ నాన్నకు ఏభై ఎకరాల పొలం వుందట. తనకెటూ చదువు లేదని, తన కొడుకునైనా గ్రాడ్యుయేటు చేయాలని ఆయన తపనట.

ఆయన ఇప్పుడు వర్గశత్రువుగా నిర్మూలించబడ్డాడు. ఆయన వర్గశత్రువో, కాదో తనకు తెలీదని కొంతసేపయింతర్వాత మా వారు సంబాళించుకున్నారు. అయినా, కొంతమంది అమాయకులు బలయినంత మాత్రాన నష్టమేంటి? అందరికి తిండి, గుడ్డా, నీడ కల్పించే వ్యవస్థ వచ్చేటప్పుడు— అని తనకు చెప్పుకున్న సమాధానం నాతో అన్నారు.

"వర్గ శత్రువుల" నిర్మూలన ఇంకా అధికమైంది. ప్రభుత్వం పోలీసు బలగాలను దింపి, నక్సలైట్ల నిర్మూలన ప్రారంభించింది. రెండు మూడేళ్ళలోనే నాయకులను హతమార్చటమో, జైళ్ళలో పెట్టడమో జరిగింది.

మా వారికి పరిస్థితి అంతా అయోమయంగా కనపడింది. ఆ రోజుల్లోనే మొదటిసారిగా ఓ రాత్రి విస్కీ ఇంటికి తెచ్చుకున్నారు. మబ్బు విడిన చంద్రుడిలాగా ఆయన ముఖం ఆరోజు వికసించింది. "శ్రమశక్తి ఇంజనీరింగు కంపెని" అధిపతి ఆరోజు ఉదయమే మా ఇంటిమీదుగా వెళ్తూ తన ఎర్రకారును ఆపారు. మా వారు ఆయన్ని ఇంట్లోకి పిలిచి సంభాషణలోకి దిగారు. ఆ అధిపతి అభ్యుదయ భావాలకు పేరున్నవాడు. తెలంగాణా సాయుధ పోరాటం దగ్గరనుంచి నక్సల్‌బరి వరకు అన్ని సంగతులపై అనర్గళంగా మాట్లాడగలడు. కొడుకు, కూతురు డాక్టర్లు. పేద ప్రజల కోసం తక్కువ ఫీజు వసూలుచేసే క్లినిక్ నడుపుతున్నారు.

"ప్రజలలో చైతన్యం పెరగందే, దేశంలో ఒక మూల విప్లవం మొదలుపెడ్తే ఉపయోగం లేదు. అనవసర రక్త తర్పణ శ్రీకాకుళంలోనూ జరిగింది" అని ఆ అధిపతి అన్నారు.

"సరే, వెళ్ళివస్తాను. మధ్యాహ్నం బ్యాంకుకు వచ్చి ఓవర్‌డ్రాఫ్టు తీసుకుంటాను" అని బయలుదేరారు. ప్రజల్లో చైతన్యం పెంపడానికి "శ్రమశక్తి" అధిపతి తన శక్తికొద్దీ శ్రమిస్తూనే వున్నారు. తను రెండుచేతులా సంపాదిస్తూ, అందులో కొంత భాగం ప్రజాసమస్యలపై పోరాడే పార్టీలకు విరాళంగా ఇస్తూనే వున్నారు. వారి కంపెనీలో ఏనాడు సమ్మె జరుగలేదంటే అది వేరే విషయం.

వారితో మాట్లాడిన తర్వాత మా వారి వైఖరిలో కొంత మార్పు వచ్చింది. ఇన్సూరెన్సు పాలసీ తీసుకోను అన్న మా వారు కొద్ది రోజుల్లోనే ఒక చిన్న పాలసీ- రూ. 10,000 కు తీసుకున్నారు. కార్మికుల రాజ్యం వచ్చిననాడు జీవిత భీమా కార్పొరేషను అవసరమే వుండదని అనేవారు.

ఆ రాజ్యం ఇప్పట్లో వచ్చే అవకాశం లేదని లీలామాత్రంగా నాకు చెప్పారు. అందులో భాగమే జీవితాన్ని భీమా చేయడం అని గ్రహించుకున్నాను.

కాని నా సంబరం ఎంతోకాలం నిలవలేదు. వారికి డబ్బన్నా, సంపాదన అన్నా మమకారం పెరగలేదు.

"వాళ్ళా భిక్షలు, కోట్లు గడించారనుకో. కట్టుకుని పోతారా?" అని తనలో తానే మాట్లాడుకుంటూ, నన్ను ఆకస్మికంగా అడిగారు "మీ ముత్తాత నీకు తెలుసా?"

"తాతనే ఎరుగను, ముత్తాత సంగతేంటి?"

"నీ ముని మనవణ్ణి చూడగలవా?" మళ్ళీ ప్రశ్న.

"అంత ఆశ, కోరిక లేవు, ఆ అవకాశం ఈ రోజుల్లో అంతకన్నా లేదు".

"అందుకే" వారు తాత్పర్యం చెప్పటం మొదలుపెట్టారు. "పుట్టబోయే తరాల కోసం సంపాదించాలని తపన పడడంలో అర్థం లేదు. ధనార్జన అనేది ఒక రకమైన జబ్బు. అదృష్టవశాత్తు ఆ అంటువ్యాధి నాకు సోకలేదు".

నిజమే మరి, బ్యాంకులో పనిచేస్తే మాత్రం సంపా

దనకు మార్గాల్లేనా? తన బ్రాంచిలో వారే కొందరు ఎలా డబ్బు గడించగల్గేది ఒకసారి చెప్పారు.

ధనవంతుల మీద అసూయతోనో, ధనార్జన చేతగాని తనం వల్లనో ఇలా అన్నారని అనుకోవడానికి ఆస్కారం లేదు. ఎందుకంటే ఈ సంభాషణ జరిగిన మూడో రోజునే ఒక స్వామీజీ ప్రసంగానికి నన్ను కూడా తీసుకునివెళ్ళారు.

మేము వెళ్ళేటప్పటికి హాలు దాదాపు నిండిపోయింది. స్వామీజీ ఇంకా రాలేదు. అందరూ స్వామీజీ గురించే మాట్లాడుకుంటున్నారు. వేదాంత రహస్యాలను అరటి పండు వలిచి చేతిలో పెట్టినట్లు చెప్తారట. ఆయన శైలి మృదు మధురమట. వాక్పటిమ అనర్గళమట.

ఇంతలోనే హాలులో నిశ్శబ్దం ఆవరించింది. స్వామీజీ ఓ పొడుగాటి విదేశీ కారులో వేంచేశారు. ఆ కారు ఓనరు, ఓ కంట్రాక్టరుగారు స్వయంగా కారు నడుపు కుంటూ స్వామీజీని తీసుకునివచ్చారు. స్వామీజీ మకాం కూడా వారింట్లోనేనట.

స్వామీజీ చాలా అందగాడు. పొడుగాటి గడ్డం, కాషాయ వస్త్రాలు ఆయన అందాన్ని ఇనుమడింప చేశాయి.



అనర్గళంగా స్వామీజీ ఉపన్యాసం కొనసాగిస్తున్నారు. "మనం మిథ్యా ప్రపంచంలో వుండి, రాగ ద్వేషాలను పెంచుకుంటున్నాం. జీవిత ధ్యేయం మోక్షం కావాలి. మోక్షం అంటే పునర్జన్మ వుండని పరిస్థితి"

పై వాక్యాలు ఏవో నాకు గుర్తున్నవి కొన్ని మాత్రమే. నా మనసంతా (తర్వాత తెలిసికొన్నా, మా వారి మనసు కూడా) స్వామీజీ వచ్చిన కారుమీద, వారి ప్రక్కన వున్న కాంట్రాక్టరు మీదే.

కారూ, కాంట్రాక్టరు మిథ్య కాదే!

ఇప్పుడర్థమయింది మా వారి మానసిక వ్యథకు కారణమేంటో. జీవితానికి అర్థమేమిటి అని ఆయన మథనపడుతున్నారు.

• • •

ఆలోచనల్లోంచి తేరుకునే లోపల బాబీ విస్కీ తీసుకునివచ్చాడు. వేడి వేడి పకోడాలు శ్రీవారి ముందు పెట్టాను.

"శశీ, వచ్చే వారమే మనం కాశ్మీరు వెళుతున్నాము, టిక్కెట్లు రిజర్వు చేయించా".

అలా కళ్ళప్పగించి చూస్తుంటే వారే చెప్పుకొని పోయారు "ఈ అనంత విశ్వంలో భూమి ఒక భాగం మాత్రమే. మిగిలిన ప్రదేశాల్లో మానవుల లాంటివారు లేరని చెప్పటానికి వీలు లేదు.

"ఈ భూమి మీద మనిషి పుట్టి కూడా కొన్ని లక్షల సంవత్సరాలయిందని చెప్పారు. నీలాంటి వాళ్ళు, నాలాంటి వాళ్ళు కొన్ని వందల కోట్లమంది పుట్టి, గిట్టి వుంటారు. ఆ నిరంతర పయనంలో మనం కూడా పాలు పంచుకుంటున్నాము. మామూలు మాటల్లో చెప్పాలంటే ప్యాసింజర్లమన్నమాట.

"పోయే రైలు బండిలో కూర్చుని ప్రకృతి రమణీయతను ఆస్వాదించడానికి బదులు, ఆ కొండ అక్కడ ఎందుకుంది, ఈ చెట్టుకు కారణమేంటి, ఆ కొండలను, చెట్లను పట్టాలకు అవలి పక్కనుంచి ఈవలి పక్కకు మార్చవచ్చునా, అసలు మనమెక్కిన బండికి గమ్యస్థానముందా అని ఆలోచించడం కాలం వ్యర్థం చేయడమనుకుంటాను. ఇతరులను ఆ పని చేయవద్దని, చేయలేరని నేను అనడంలేదు. నేను మార్క్సును కాను, మావోను కాను, రామకృష్ణ పరమహంసను కాను, వివేకానందుని కాను, గాంధి, నెహ్రూలను అసలే కాను. మామూలు సగటు మనిషిని.

"ఉన్నన్నాళ్ళు న్యాయంగా సంపాదించిన దాంతో సుఖంగా వుందాం. పునర్జన్మ వద్దనాల్సిన అవసరం లేదు. వస్తుందేమో మనకు తెలియదు.

"చక్కగా రెండు పట్టుచీరెలు రేపే కొనుక్కో. పిల్లవాడికి, నాకు నీకు నచ్చిన బట్టలు కొను. సరదాగా కాశ్మీరు వెళ్ళి, హిమాలయాల పైనుంచి దేశం ఎలా పోతుందో చూద్దాం".

వారి పెదిమల మీది చిరునవ్వుకు కారణం ఇప్పుడర్థమైంది. జ్ఞానోదయమైన బుద్ధునితో లాగా వారిలో ఓ కొత్త ప్రశాంతత ఇప్పుడు కనబడుతోంది. ●